క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



పిఠాపురం - ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కొత్తపల్లి: పిఠాపురం - ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప రామాలయం వద్ద పైపులైన్ కోసం తవ్విన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఒకవైపు పైపులైన్ గొయ్యి, మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

20న యంగ్ మైండ్ వార్షికోత్సవం

బాలాజీచెరువు: ఈ నెల 20న స్థానిక దంటు కళా క్షేత్రంలో యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు వాకడ వెంకటరమణ (చిన్న) ఆదివారం తెలిపారు. ఆ రోజు దేశ సైనికులు, అన్నదాతలు, నర్సులు, పారిశుధ్య కార్మికులు, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, సమాజ సేవకులు, కళాకారులు, జర్నలిస్టులు, ఆదర్శ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

విశ్వ బ్రాహ్మణులు ఐక్యంగా సాగాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆవుపాటి ఉమామహేశ్వరరావు

సామర్లకోట: విశ్వ బ్రాహ్మణులు ఐక్యంగా సాగాలని విశ్వబ్రాహ్మణ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కో చైర్మన్ ఆవుపాటి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం సామర్లకోట మండలం వేట్లపాలెం గాయత్రి విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రామోజు కాశీవిశ్వనాథం అధ్యక్షతన జరిగిన జిల్లా అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. బంగారు, వడ్రంగి పనివార్లకు చెందిన విశ్వబ్రాహ్మణులు తరచూ సమావేశాలు నిర్వహించుకుని వారి సమస్యలపై చర్చించుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం అన్నారు. ఈ మేరకు విశ్వబ్రాహ్మణుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల అర్జునరావు, కార్యదర్శి వేముల మంగపతి, నాయకులు గొట్టేటి దుర్గాప్రసాదరావు, మునాసుల శంకరాచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మోజు సత్యనారాయణ, వేట్లపాలెం విశ్వబ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు పి.శివదుర్గ, కార్యదర్శి దివిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట.. సాగుదంట

- ఖరీఫ్‌కు అందని సాగునీరు
- పట్టించుకోని అధికారులు
- పవన్ కల్యాణ్ ఇలాకాలో పరిస్థితి

పిఠాపురం: సాగుకు పుణ్యకాలం పూర్తవుతోంది. ఖరీఫ్‌కు నీరు లేక రైతులకు ఆవేదనే మిగులుతోంది.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితిపై అంతా నివ్వెరబోయే పరిస్థితి వచ్చింది. ఏలేరు ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకు చేరుకోగా, ప్రస్తుతం ఏలేరు ఆయకట్టుకు నీటి ఎద్దడి తీవ్ర సమస్యగా మారింది. కనీసం నారుమడులు వేసేందుకు కూడా నీరు లేక ఖరీఫ్ నిలిచిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయానికి నాట్లు పూర్తయ్యి కలుపుతీసే పనులు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటికీ ఎక్కడా ఒక్క నారుమడి కూడా సిద్ధం కాని పరిస్థితి ఎదురైంది. ఏలేరు నుంచి నీటిని విడుదల చేశామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నా చుక్క నీరు కూడా పిఠాపురం ఆయకట్టుకు చేరలేదు. మరోపక్క వర్షాలను నమ్ముకుని వాణిజ్య పంటలు వేసిన రైతులు బోర్ల ద్వారా సాగు చేసే పరిస్థితికి వచ్చారు. బోర్ల ద్వారా కూడా నీరు అందక నూతుల్లో నీరు తోడుకుని మోసుకుని మొక్కలకు వేసుకునే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.

పిఠాపురం నియోజకవర్గ పరిధిలో సుమారు 42 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి ఏలేరు, పీబీసీ ద్వారా సాగునీరు అందించాలి. కానీ ఇప్పటి వరకూ ఈ కాలువల నుంచి నీరు రాక ఖరీఫ్ ఇప్పటికే 50 రోజుల ఆలస్యమైంది. ప్రస్తుతం ఏలేరుకు నీరు వదిలినట్టు చెబుతున్నా, ఎక్కడా నీరు వచ్చిన జాడ లేదని రైతులు అంటున్నారు. మరోపక్క పీబీసీ నుంచి అరకొరగా నీరు వస్తున్నా మురికిగా రావడంతో పాటు కంపు కొడుతుండడంతో అది పంటలకు ఏమాత్రం పని చేయదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వెదజల్లే పద్ధతిలో సాగు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నీరు లేకుండా, దమ్ము చేయకుండా ఎలా వెదజల్లుతామని రైతులు ప్రశ్నిస్తున్నారు.



గొల్లప్రోలు మండలం మల్లవరం వద్ద అడుగంటిన పంట కాలువ

ఎక్కడ పూడిక అక్కడే..

రూ.కోట్లతో క్లోజర్ పనులు చేస్తున్నామని అధికారులు, అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ ఏ కాలువ చూసినా ఎక్కడికక్కడే పూడిక కనిపిస్తోంది. చేసినట్టు రాసుకుంటున్నారనే తప్ప ఎక్కడా ఏ కాలువ పూర్తిగా బాగు చేయలేదని రైతులు పెదవి విరుస్తున్నారు. కాలువల్లో ఎక్కడికక్కడే చెత్త ఉండడంతో నీరు వదిలినా ముందుకు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. గత నెల రోజుల క్రితమే క్లోజర్ పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పనులు ఆలస్యంగా ప్రారంభించారని వాపోతున్నారు. అక్కడక్కడా పూడిక తీసి ఫొటోలు తీసుకుని అంతా చేసినట్లు రాకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఏలేరు, పీబీసీ కాలువల్లో వర్షపు నీరు కూడా అడుగంటి పోయి పశువులకు కూడా తాగు నీటి ఎద్దడి నెలకొందంటున్నారు.



మల్లవరం వద్ద పంట కాలువలో గుర్రపుడెక్క



పిఠాపురం వద్ద పీబీసీ కాలువ నుంచి వస్తున్న మురికి నీరు

నీరు లేదు.. నారు లేదు



ఏటా ఈ సమయానికి నాట్లు పూర్తయ్యి కలుపు తీసుకునే వాళ్లం. ఈ ఏడాది నీరు లేక నారుమడులు వేసే పరిస్థితి లేదు. కాలువల్లో ఉన్న కొద్దిపాటి నీటిని తోడుకుని నారుమడులు వేద్దామని విత్తనాలు సిద్ధం చేసుకుంటే కాలువల్లో మురికినీరు వస్తోంది. తీరా విత్తనాలు నానబెట్టి సిద్ధం చేయడంతో చేసేదేమి లేక కావిళ్లతో నీరు మోసుకుని నారుకు పోసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చాలామంది అసలు నారుమళ్లు వేయడం ఆపేశారు. ఇలాంటి దారుణ పరిస్థితులు మునుపెన్నడూ చూడలేదు.

– పదిలం కొండబాబు, రైతు, చేబ్రోలు

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత



వర్ధినీడి సుజాత

పిఠాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ కరవైందని, వారిపై దాడులు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత ఆరోపించారు. కృష్ణా జిల్లా గుడివాడలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక వాహనంపై బండ రాళ్లతో దాడికి తెగబడడం, బూతులు తిట్టడం యావత్తు మహిళా లోకాన్ని తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ జిల్లా ప్రథమ పౌరురాలైన మహిళపై ఇంత దౌర్జన్యం జరిగితే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతుందని, దీనిపై హోంమంత్రి అనిత సమాధానం చెప్పాలన్నారు. పోలీసులు పక్కన ఉండి కూడా దాడిని నివారించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ‘బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ’ కార్యక్రమానికి వెళుతున్న బీసీ నాయకురాలు ఉప్పాల హారిక వాహనంపై దాడికి దిగడాన్ని అంతా ఖండిస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కూటమి ప్రభుత్వానికి మహిళలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొడతాం..

- ఈ నెల 16న జిల్లా మహాసభ
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు



సీపీఐ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మధు

సామర్లకోట: సీపీఐ మహాసభలను ఈ నెల 15, 16 తేదీల్లో సామర్లకోటలో నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా గుర్తింపు పొందడం వల్ల ఈ మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని విధానంపై, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పలు తీర్మానాలు చేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు ఏడాది గడిచినా అమలు చేయకపోవడంపై ఉద్యమ కార్యచరణ చేస్తామన్నారు. అదే విధంగా ప్రజలకు తీరని అన్యాయం జరిగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు వ్యతిరేకించగా.. నేడు వాటిని అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం దీక్షలు చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు ఆ మాట పక్కనపెట్టడం దారుణమని వివరించారు. వ్యవసాయ కార్మికుల వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం వంటి అంశాలపై తీర్మానాలు చేస్తామని చెప్పారు. ఈ మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.దుర్గలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బొడకొండ, అడపా చిట్టిబాబు, పెదిరెడ్ల సత్యనారాయణ, మడగల రమణ, పెదిరెడ్ల అర్జునరావు, సప్పా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు, వివిధ కేసుల్లో నిందితులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరం చేసిన వారు తరువాత మారుతుంటారని, కానీ కొందరు నేరాలకు అలవాటు పడి అదే వృత్తిగా కొనసాగిస్తుంటారన్నారు. అలాంటి వారు మారకపోతే జీవితాంతం జైలు పాలయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఎటువంటి నేరాలకు పాల్పకుండా సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్లు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా ఏదైనా గొడవలు, కేసుల్లో ప్రత్యక్షంగా పాల్గొంటే వారి బెయిల్ రద్దు చేయించి తిరిగి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఠాపురం పట్టణ, రూరల్, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్సైలు మణికుమార్, జానీబాషా, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డులో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు వద్ద మద్యం, ధూమపానం, గుట్కా వంటివి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాకంబరీ శరణు శరణు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో నూకాలమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య పర్యవేక్షణలో పంచారామ క్షేత్రంలోని దీపారాధన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఈ అలంకరణ జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో పారాయణ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మద్దుకూరి జోగారావు, యార్లగడ్డ శ్రీను, బొమ్మాలరావు, గోలి రాంబాబు, పెనుమరితి పెద్దకాపు, బోళ్ల శేఖర్, పారాయణ కమిటీ ప్రతినిధులు సత్తి అరుణ, చుండ్రు సరస్వతి, చలికి తులసమ్మ, వరలక్ష్మిలు భక్తులకు సేవలందించారు.



సామర్లకోటలో నూకాలమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు



సామర్లకోటలో అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

సామర్లకోట ఐదు తూముల వద్ద హరిహర క్షేత్రంగా పేరొందిన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. బళ్ల మార్కెట్‌లో గణపతి ఆలయం వద్ద పూజలు నిర్వహించి పెద్ద, చిన్న వీధుల మీదుగా సాగింది. ఆలయ అర్చకులు పెండ్యాల సుబ్రహ్మణ్యం, దాకమూరి మణికంఠలు పూజాదికాలు నిర్వహించారు. భక్త కమిటీ నాయకులు గండ్రేటి సూర్యకుమారి (మాజీ కౌన్సిలర్), వెంకటరమణ, త్రిమూర్తులు, నిర్మల, నరసింహమూర్తి (చిన్నా) రత్నం, అర్జునుడు భక్తులకు సేవలందించారు. ఆలయ ధర్మకర్త పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, అంకురార్పణ, నవగ్రహ శాంతి, మండపారాధన, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన హోమం జరిగాయి. 23న పూర్ణాహుతితో యాగ కార్యక్రమాలు ముగుస్తాయని పరమానందగిరిస్వామి వివరించారు.

ఉత్సాహంగా బోనాల సంబరం

ఆషాఢ మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని స్థానిక పశువులమ్మ ఆలయం వద్ద బోనాల సంబరం జరిగింది. భక్తులు బోనాలను ఎత్తుకుని పట్టణ వీధుల మీదుగా ప్రదర్శన నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారిని, ఆలయాన్ని ఉప్పువారివీధి, కోలావారి వీధికి చెందిన భక్తులు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. స్థానిక బొమ్మల తయారీ కళాకారుడు కర్రి అప్పలరాజు సుమారు 700 మంది మహిళా భక్తులకు జాకెట్ ముక్కలు అందజేశారు. ఆలయ ధర్మకర్త తోలేటి సత్యనారాయణ, నిర్వాహకులు కె.శ్రీనివాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధి కర్రి ఆదినారాయణరెడ్డి, దవులూరి నాగేశ్వరరావు, కర్రి అప్పలరాజులు భక్తులకు సేవలందించారు.



శాకంబరి అవతారంలో కాండ్రకోట నూకాలమ్మ



సామర్లకోటలో పశువులమ్మ..



గొల్లప్రోలులో శాకంబరిగా శ్రీదేవి అమ్మవారు

29న మంగళగౌరీ వ్రత పూజలు

సామర్లకోట మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 29న శ్రావణ మాసం, మంగళగౌరీ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకుడు అనంత పద్మనాభాచార్యులు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాను పురస్కరించుకుని భక్తులచే సామూహిక పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని అన్నారు.

గొల్లప్రోలులో..

పిఠాపురం: గొల్లప్రోలు దేవినగర్‌లో శ్రీదేవి అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా నూకాలమ్మ

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రాంబాబురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేశారు. తొలుత అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా వేద పండితులు అలంకరించారు. అమ్మవారికి స్వీట్లు, పండ్లు, నూతన వస్త్రాలను సారెగా భక్తులు సమర్పించారు.

మొక్కబడిగా..

- మొక్కలు నాటే తీరుపై విమర్శలు
- నిర్లక్ష్యం మాటున నీలమ్మ చెరువు గట్టు



నీలమ్మ చెరువు గట్టుపై సగం తీసిన గొయ్యిలో పెట్టి వదిలేసిన మొక్కలు

సామర్లకోట: చూసేవారెవరంట.. పట్టించుకునేవారెవరంట.. అన్నట్టుంది కూటమి పాలకుల తీరు. అందుకే అధికారులకు ఆడిందే ఆటగా మారింది. ప్రజాధనం కాస్త గోతిలో కలసిపోతోంది.. ఆ సం‘గోతులు’ ఏంటో తెలుసుకుందాం రండి. ఏటా పచ్చదనం, పరిశుభ్రత పేరుతో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత సీజన్‌కు సుమారు 500 మొక్కలు వచ్చాయి. వీటిని ఆయా ప్రదేశాల్లో నాటాల్సి ఉంది. ఇందులో సుమారు 100 మొక్కలను స్థానిక నీలమ్మ చెరువు గట్టు చుట్టూ వేయాలని నిర్ణయించారు. చెరువు గట్టుపై గోతులు తీశారు. చాలారోజులు అలా వదిలేశారు. ఇప్పుడేమో వచ్చిన మొక్కలను కవర్లు కూడా తీయకుండా ఆ గోతుల్లో పెట్టి మట్టి వేయకుండా వదిలేశారు. ఈ గుంతలు కూడా అడుగు లోతు కూడా తీయలేదు. మొక్క అందులో పెట్టి మాత్రం ఉంచేశారు. సుమారు 20 రోజుల క్రితం నీలమ్మ చెరువు గట్టుపై గోతులు తీయగా, మూడు రోజుల కిందట మొక్కలు గోతుల్లో పెట్టి అలానే ఉంచేయడంపై చెరువు గట్టుపై ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారు ఆందోళన చెందుతున్నారు. ఈ మొక్కల సంరక్షణ లేకపోవడంతో చెరువు గట్టుపైకి వచ్చిన పశువులు మొక్కలను తినేస్తున్నాయి. నీలమ్మ చెరువు అంటేనే నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. 2000లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నీలమ్మ చెరువును అభివృద్ధి చేయడానికి శంకుస్థాపన చేసి, రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులు దుర్వినియోగం కావడంతో అప్పటి నుంచి చెరువు కళావిహీనంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెరువు గట్టుకు రివెట్‌మెంట్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. చెరువు గట్టుపై పార్కును అభివృద్ధి చేయాల్సి ఉండగా, ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

నిర్లక్ష్యం.. కొనసాగుతున్న వైనం

మొక్కలు పెంపకంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం కొనసాగుతోంది. గతంలో సామర్లకోట – పెద్దాపురం రోడ్డులోని డివైడర్‌లో మొక్కలు వేయగా ఒకటి కూడా బతకలేదు. గత ఏడాది కొట్లమ్మ చెరువు గట్టుపై మొక్కలు వేయగా వాటిని పట్టించుకోకపోవడంతో వాటి పరిస్థితి ఇదే విధంగా మారింది. దాంతో తిరిగి శుక్రవారం కోట్లమ్మ చెరువు గట్టుపై ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు వేశారు. నీలమ్మ చెరువు చెరువు గట్టుపై వాకింగ్ చేసే వారు గోతులలో ఉన్న ఎండిపోయిన మొక్కలను ప్రజలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. నీలమ్మ చెరువు గట్టుపై మొక్కలు పెట్టి పూడ్చలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే ఆమె ఆశ్చర్యపోయారు. ఇప్పటికైనా మొక్కలు వేయడంతో పాటు వాటిని సంరక్షించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన మొక్కలు


ఎందుకు వేశారో తెలియడం లేదు



నీలమ్మ చెరువు గట్టుపై రోజూ ఉదయం వాకింగ్ చేస్తుంటాను. సుమారు 20 రోజుల క్రితం గోతులు తీస్తూ ఉంటే ఎందుకు తీస్తున్నారంటే సమాధానం లేదు. నాలుగు రోజుల క్రితం మొక్కలు తీసుకువచ్చి గోతుల్లో పెట్టి వదిలేశారు. వాటిని పూడ్చలేదు. గోతులు కూడా పైపైన తీశారు. మొక్కలు పెరగడానికి కనీసం రెండు అడుగుల లోతు గొయ్యి తీయాలి. మొక్క బతికే వరకూ కనీసం నీరు పోయాలి. అటువంటి ప్రక్రియ మున్సిపల్ అధికారులు నిర్వహించడం లేదు.

– నమ్మి శ్రీనివాసు, చిరు వ్యాపారి, సామర్లకోట

లోతుగా గోతులు తీసి వేయిస్తాం..



నీలమ్మ చెరువు గట్టుపై మూడు రోజుల క్రితమే మొక్కలు వేయడానికి రంగం సిద్ధం చేశాం. ఈ బాధ్యత ఏఈకి అప్పగించాం. అటవీ శాఖ నుంచి మొత్తం 400 మొక్కలు వచ్చాయి. కోట్లమ్మ చెరువు గట్టుపై మొక్కలు వేశారు. నీలమ్మ చెరువు గట్టుపై మొక్కలు వేసే ప్రక్రియ పూర్తయ్యిందని భావించాం. వరుసగా సెలవులు కావడంతో జాప్యం జరిగి ఉండవచ్చు. నీలమ్మ చెరువు గట్టుపై మొక్కలు వేయించి రక్షణ కల్పించడంతో పాటు రోజూ నీరు వేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

బస్ ‘స్టాప్’ ఏదీ...?



పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద నిరుపయోగంగా బస్టాప్

పిఠాపురం: అది బస్టాప్ అయినా అక్కడ బస్సులు ఆగవు. ప్రయాణికుల ఇబ్బందులు అధికారులకు పట్టవు. పిఠాపురం బైపాస్ రోడ్డులో పాదగయ క్షేత్రం వద్ద ఇటీవల బస్టాప్ నిర్మించారు. అక్కడ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు మండుటెండలో నిలువ నీడ లేనిచోట నిల్చుని బస్సులు ఎక్కాల్సి వస్తుంది. దీంతో ఆ బస్టాప్ నిరుపయోగంగా మారింది. నిర్మించిన నేతలు, అధికారులు పట్టించుకోక పోవడంతో అది ఇప్పుడు ఒక పార్టీ జెండాలు మోసే షెడ్డుగా మిగిలింది.



మండుటెండలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి ఆదివారం వైభవంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరునక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని 108 కలశాల పంచామృతాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి అభిషేకించారు. పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.